'ఆంధ్రప్రదేశ్' మాస పత్రిక వారి దీపావళి కథల పోటీలో ప్రథమ బహుమతి పొందిన కథ

# బడి అవతల...

## సత్యాజీ

ఒకే జాతి సీతాకోకచిలకలు వందలు వందలుగా వచ్చి వాలిన అందమైన పూలతోటలా ఉంది బడి. కొన్ని తరగతి గదుల్లో- తుమ్మెదలన్నీ కలిసి ఉమ్మడిరాగం పాడుతున్నట్టు పాఠాలను వల్లె వేస్తున్నారు పిల్లలు. కోకిల పాటను పారవశ్యంతో వింటున్నట్టుగా కొన్ని క్లాసుల పిల్లలు మాస్టార్ల పాఠాల్లో లీనమైపోయారు.

అది ఏడో తరగతి గది.

తెలుగు మాస్టారు పాఠం చెబుతున్నారు. మధ్యమధ్యలో ప్రశ్నలు అడుగుతున్నారు. తెలిసిన పిల్లలు హుషారుగా పైకి లేచి సమాధానం చెబుతున్నారు. తెలీనివాళ్లు బిక్కమొగం వేస్తున్నారు.

'బమ్మెర పోతన ఎవరో తెలుసా?' అడిగారు గంగన్నని.

గంగన్న భయపడుతూ లేచాడు. చేతులు కట్టుకున్నాడు. ఏం చెప్పాలో తెలీక, మాస్టారి వైపు చూస్తూ ఉండిపోయాడు.

'తెలుసా? తెలీదా?'

'తెలీదండీ' భయం భయంగా చెప్పాడు.

'ఏం తెలుసు నీకు?' అన్నారు కోపంగా.

మాట్లాడలేదు గంగన్న. తలకిందకి దించుకొని నించొని ఉన్నాడు. నీకేం తెలుసని అడిగినప్పుడు మామూలుగా అయితే మాట్లాడకుండా ఉండడు. తెలిసిన సంగతులు చాలా హుషారుగా చెబుతాడు. కానీ, తనకు తెలిసిన విషయాలు ఇక్కడ పనికిరావు. ఇక్కడ పుస్తకాల్లోని సంగతులు తెలిస్తేనే తెలిసినట్టు. లేకపోతే ఏమీ తెలీనట్టే!

స్కూల్లో చేరిన కొత్తలో ఈ మాస్టారే ఏదో ప్రశ్న అడిగారు. జవాబు తెలీదు కాబట్టి అలా నుంచుని ఉండిపోయాడు.

'తెలుసా? తెలీదా?' అనడిగితే, 'తెలీద'న్నట్టుగా తలూపాడు.

'అసలు నీకేం తెలుసు?' అనడిగారు.

అలా అడగటం మాస్టారి అలవాటు. ఆ విషయం అప్పటికి గంగన్నకి తెలీదు. ఆ ప్రశ్నతో ఏదో స్ఫురించి, నిటారుగా నిలబడ్డాడు. తనకు తెలిసిన విషయాలు చాలా ఉన్నాయి. వాటిలో ఏవి చెప్పాలో, ఏవి ముందు చెప్పాలో ఆలోచిస్తున్నాడు.

ఆ ఆలోచనల గురించి తెలీని మాస్టారు- ఇక కూర్చో అన్నట్టు సైగ చేశారు. గంగన్న గమనించలేదు. మాస్టారు మరో విద్యార్థిని లేపారు, ప్రశ్నకు జవాబు చెప్పమని.

అప్పుడు మొదలెట్టాడు గంగన్న.

'మాస్టారూ... నాకు ఈత భలే వచ్చండి! మా నేస్తాలందరి కన్నా నేనే ఫస్టు. పొద్దుటినుంచి అన్నమేళ దాకా ఈత కొడతానండి. గుమ్మిలోకి దూకానంటే అందరినీ మెడ్డీంచేత్తాను. నిలువీత, వెనకీత కూడా వచ్చండీ...'



ఏం చెబుతున్నాడో మాస్టారికి అర్థం కాలేదు.

పక్క కుర్రాడిని ప్రశ్న అడిగితే గంగన్న మాట్లాడటం, అది కూడా ప్రశ్నకు సంబంధం లేని ఈత గురించి చెప్పటం...

'ఇంకానండీ... కంజుకోడి వేట భలే వచ్చండి. నేనూ, గింజరిగాడు వేటకెళ్లామంటే పోటాపోటీ అండీ. ఆఖరికి ఒకటో రెండో నేనే ఎక్కువ తెస్తానండి...' ఊపిరి పీల్చుకొని, మళ్లీ మొదలెట్టాడు.

'ఇంకానండీ... మా ఊరి దగ్గరి సూదికొండ చివరికి గబగబా ఎక్కగలనండి. నేను ఎక్కిన చాలాసేపటిదాకా ఇంకెవరూ ఎక్కి రాలేరండి... ఒకసారండీ...'

చిర్రెత్తిపోయారు మాస్టారు. 'ఏంటీ సోది... ఆపాపు...' అని గద్దించారు.

పిల్లలు పకపకా నవ్వారు. వాళ్ల నవ్వుల్లో ఎగ తాళి, అవహేళన తెరలుతెరలుగా ధ్వనిస్తున్నాయి. క్లాసంతా అల్లరి అల్లరిగా మారిపోయింది. మాస్టారికి కోపం వచ్చింది.

బల్ల గట్టిగా చరిచి, 'సైలెన్స్' అని అరిచారు. నవ్వులు ఆగిపోయాయి. గంగన్న చెప్పటమూ ఆగిపోయింది. మాస్టారు తీక్షణంగా చూశారు. భయపడ్డాడు గంగన్న.

'కూర్చో' అన్నారు గట్టిగా.

వెలిగించి వదిలిన బాంబు ఉండుండీ పేలినట్టు మళ్లీ నవ్వులు.

'సైలెన్స్' అని గద్దించి, గంగన్న వైపు కొరకొరా చూశారు మాస్టారు.

'తెలీటమంటే కొండలెక్కటం, ఈతకొట్టటం కాదురా. ఈ పనులు చదువూ సంధ్యా లేని ప్రతి ఒక్కడూ చేస్తాడు. దానిలో లేదు గొప్ప. ఇలాంటివి ఇంకెప్పుడూ చెప్పకు. ఒళ్లు దగ్గర పెట్టుకొని చదువు' అన్నారు. వాచీ ఓసారి చూసుకొని చరచరా క్లాసులోంచి వెళ్లిపోయారు.

ఫస్ట్ పీరియడ్ పూర్తయినట్టు అప్పుడే గంట మోగింది. గది పై కప్పు ఎగిరిపోయేటట్టు నవ్వులు మళ్లీ మొదలయ్యాయి. గంగన్నకి ఏడుపొచ్చినట్టయింది కానీ, ఏడవ లేదు. అలాటి పరిస్థితిలోనూ ఏదో అర్థమయినట్టుగా అన్పించింది.

తనకు తెలిసిన విషయాలకు ఇక్కడ విలువ లేదు. ఇక్కడ చెప్పేవే విలువైన విషయాలు. వాటిని నేర్చుకుంటేనే విలువ.

* * *

ఆ సంఘటన తరువాత గంగన్న బాగా కుంచించుకుపోయాడు. ఏది మాట్లాడితే ఏం తప్పో తెలీదు. ఏం మాట్లాడాలో ఏం మాట్లాడకూడదో భయం. స్కూల్లో ఉన్నంతసేపూ మూగవాడిలా మారిపోవటం అలవాటయి పోయింది. స్కూలుకి రావటం ఎప్పుడూ మానడు. పాఠాలు శ్రద్ధగా వింటాడు. ఏదైనా అడిగితేనే నోరు పెగలదు.

మాస్టారికి ఆ విషయం అర్థమయింది.

నించొని ఉన్నవాణ్ణి కూచోమని చెప్పి, పాఠం కొనసాగించారు.

ఇంటర్వెల్ బెల్ మోగింది. పంజరం తెరిచిన పిట్టల్లా గోల చేస్తూ, పరుగులు తీశారు పిల్లలు. క్లాసు రూములు బోసిపోయి, గ్రౌండ్ కళకళ్లాడుతోంది. ఎగరలేని పక్షిపిల్లల్లా పుస్తకాలు ఒంటరిమైపోయాయి. ఆ పుస్తకాల మధ్య గంగన్న ఒక్కడే మిగిలాడు.

* * *

ఆ రోజు బడి విడిచిపెట్టాక సంచి సర్దుకొని ఇంటికి వెళ్లిపోబోతుంటే- తెలుగు మాస్టారు పిలిచారు. ఎందుకోసమా అని జంకుతూ వెళ్లాడు.

'రేపు మీ ఊరు వస్తాను. ఓటరు లిస్టు రాయాలి. ఆదివారం కదాని కొండలూ కోనలూ ఎక్కేయకుండా కాస్త ఇంటి దగ్గరే ఉండు' అన్నారు.

ఆ రోజు రాత్రి గంగన్న నిద్రపోలేదు. ఎప్పుడు తెల్లారుద్దా అని తెల్లార్లూ అనుకుంటూనే ఉన్నాడు. పొద్దున్నే లేచి నేస్తాలను వెంటబెట్టుకొని ఊరవతల చింతచెట్టు దగ్గర కాపలాకు దిగాడు. ఒక్కొక్క నిమిషం ఒక్కొక్క యుగంలాగ ఉండి, ఆఖరికి నిరీక్షణ కష్టంగా ఉండి, మాస్టారు ఎక్కడి దాకా వచ్చారో ఎదురెళ్లి చూద్దామని బయల్దేరి, నడుచు కుంటూ నడుచుకుంటూ, పొలిమేరలు దాటి, కొండెక్కి దిగి, ఏకంగా మాస్టారింటికి వచ్చేశాడు నేస్తాలతో సహా.

గంగన్నని చూసి మాస్టారు ఆశ్చర్యపోయారు.

'నేను మీ ఊరు వస్తానంటే నువ్వేంటి ఇలా వచ్చావు' అన్నారు.

'అదీ..., మీ కోసమేనండీ పొద్దున్నుంచి చూస్తున్నాం.

చూసిచూసీ మీరు రాకపోయేసరికి తోవలో ఉన్నారేమోనని చూసుకుంటూ వచ్చేశాం' అన్నాడు. మాస్టారు తల తిప్పి చూస్తే- ఇంటికి దూరంగా, ఒంటి మీద చొక్కాల్లేకుండా చిరుగుబొరుగు పంట్లాలు వేసుకున్న నలుగురు పిల్లలు తమవైపే చూస్తూ కన్పించారు.

'వాళ్లనిలా పిలువ్' అని చెప్పి, ఇంట్లోకెళ్లి అందరికీ స్వీట్లు తెచ్చిచ్చారు. అప్పుడు టైం ఏడున్నర. ఇంటి పనులు చూసుకొని ఎనిమిదిన్నర - తొమ్మిది మధ్య బయల్దేరదామనుకున్న ఆయన ఎనిమిదింటికే బయల్దేరారు.

పుస్తకాల సంచి భుజానేసుకొని నడుస్తున్నాడు గంగన్న. ఆ వెనక మాస్టారు, ఆయన వెనక గంగన్న నలుగురు నేస్తాలూ.

గంగన్న వాళ్లూరు ఓ గిరిజన పల్లె. ఆరేడు కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఐదు వరకూ ఊళ్లోనే చదివాడు. ఐదుదాటి, ఆ కొండ దాటి పిల్లలెవరూ రారు. గంగన్న చురుగ్గా ఉన్నాడని ఓ మలేరియా వర్కర్ గమనించి, ఈ స్కూల్లో చేర్పించాడు. కొంచెం మట్టి రోడ్డు, తరువాత ఓ మాదిరి కొండ, అది దిగి ఇంకొంచెం దూరం నడిస్తే ఊరొస్తుంది. సైకిలు కూడా వెళ్లే అవకాశం లేదు. కాలి నడక ఒక్కటే శరణ్యం. గట్టిగా నడిస్తే గంట ప్రయాణం. ఆ దారంట నడవటం గంగన్నకి కొట్టినపిండే.

* * *

నడుస్తున్నకొద్దీ మట్టిరోడ్డు సన్నని కాలిబాట అయిపోయింది. బాట బాగా నలిగి ఉన్నా అక్కడక్కడ రాళ్లూ ముళ్లూ పడి ఉన్నాయి. నడుస్తూ నడుస్తూ ఓ రాయిని తన్నుకొని తూలి పడబోయారు మాస్టారు. అమాంతంగా వెనక్కి తిరిగి మాస్టారి చెయ్యందుకున్నాడు గంగన్న.

అప్పుడు చూశారు మాస్టారు గంగన్న కాళ్లవైపు. చెప్పుల్లేవు. వెనక్కి తిరిగి చూశారు. ఆ నాలుగు జతల పాదాలకూ్కడా లేవు. గంగన్న చాలా వేగంగా నడుస్తున్నాడు. నడకలో చలాకీతనం, చురుకుదనం తాండవిస్తున్నాయి. మాస్టారు అడుగులు నెమ్మదిగా పడుతున్నాయి. రాళ్ళూరప్పలూ జాగ్రత్తగా చూసుకుంటూ నడవాల్సివస్తోంది. ఏమరుపాటుగా ఉంటే ఇందాకటిలాగా ఏ రాయినో తన్నాల్సివస్తుందని భయం. మాస్టారికి చిరుచెమట, కొద్దిపాటి ఆయాసం మొదలయ్యాయి.

ఏదో పెద్దచెట్టు కనిపించేసరికి సేద తీరాలని ఆగారు. రుమాలు తీసుకొని ముఖం తుడుచుకున్నారు. ఇంటి దగ్గర నుంచి తెచ్చుకున్న నీళ్ల సీసాలోంచి కొద్దిగా నీళ్లు తాగారు. గంగన్నని తాగమంటే – కొండెక్కి దిగితే గెడ్డ వస్తుందని, అక్కడ తాగుతామని చెప్పాడు. నేస్తాలు కూడా అదే మాటన్నారు.

చెట్టుపైకి చూసి, 'ఇది ఏం చెట్టో' అని తనలోతానే అనుకుంటున్నట్టుగా పైకే అన్నారు మాస్టారు.

'ఇది నల్లజీడి చెట్టండి. దీని పళ్లు కాల్చుకుని తింటే భలే ఉంటాయండి. పిక్కలు వాతానికి పనికొస్తాయండి. వాటితో దిష్టి కూడా తీస్తారండి. గేదెలకి మెళ్లో దండలు గుచ్చొచ్చండి. పిల్లల మొలతాడుకి కూడా కడతారండి.'

టకటకా చెప్పేశాడు గంగన్న.

'ఇదిగోండి... వీడికి చూడండి..' అని చిలకగాడిని పిలిచి, వాడి మొలతాడు పైకి లాగి చూపించాడు. నల్ల జీడిపిక్కకు ఇటూఅటూ ఎర్రటి పూసలు చేర్చి, అవి చెదిరిపోకుండా అందంగా ముడులు వేసి ఉందది.

మాస్టారు అభినందనపూర్వకంగా నవ్వారు. చిలకగాడు కాస్త సిగ్గు పడ్డాడు.

'నాకు తెలియని చెట్టు గురించి, దాని ఉపయోగాల గురించి గంగన్నకి ఎంత బాగా తెలుసు' అనుకున్నారు మాస్టారు. గంగన్న గురించి అలా అనుకోవటం అదే మొదటిసారి.

సేద తీరాక నడక మళ్ళీ మొదలయింది. కొంతసేపటికి కొండ ఎక్కడం మొదలయింది. గంగన్న కాళ్ళు చకచకా కదులుతున్నాయి. మాస్టారికి మాటిమాటికీ ఎగ ఊపిరి తన్నుకొస్తోంది. పదేపదే ఆగాల్సి వస్తోంది. ఆగిన ప్రతిసారీ కాసిన్ని నీళ్ళు తాగితేనే అలసట తీరినట్టుంటుంది.

కాసేపట్లో దిగుడు ప్రయాణం మొదలయింది. ఇందాకటికన్నా సులభంగా, వేగంగా సాగుతోంది నడక. ఆ కొండ విశేషాలు చెప్పమని అడిగారు మాస్టారు. నడుస్తున్నవాడల్లా ఉన్నపళాన గిరుక్కున వెనక్కి తిరిగి చూశాడు గంగన్న. నవ్వుతూ మళ్ళీ అడిగారు మాస్టారు.

గంగన్న కళ్ళల్లో సంభ్రమం! అప్పుడు మొదలెట్టాడు.

కొండ సిగలనుంచి ఉరికే జలపాతంలా ఉంది మాటల వేగం. ఉధృత ప్రవాహంలా ఉంది వాడి ఉత్సాహం. జోలెడన్ని కబుర్లు. చెట్లగురించి, మొక్కలగురించి, పూలగురించి, రకరకాల పండ్ల గురించి ఎన్నెన్నో విశేషాలు. పిట్టలగురించి, జంతువుల గురించి, వాటి స్వరూప స్వభావాల గురించి హావభావాలతో సహా వర్ణనలు. వీటన్నింటిలో తన, తన మిత్రుల, తన ఊరివాళ్ళ స్వీయానుభవాలూ... ఎంతో సజీవంగా, సహజంగా, సంతోషంగా సాగిపోతున్నాయి కబుర్లు.

కొత్త సంగతులు తెలుస్తున్నాయి మాస్టారికి. ప్రకృతి ఒడిలో సాగిపోతూ, ప్రకృతి సోయగాలను ఆస్వాదిస్తూ, ప్రకృతి గురించి తెలుసుకోవటం చాలా కొత్తగా ఉంది. అది కూడా తరగతి గదిలో భయంభయంగా కూచొని, ఏమీ తెలియనివాడని ముద్ర పడిపోయిన గంగన్న చెబుతుంటే వినటం ఒక సరికొత్త అనుభవంలా ఉంది.

మాస్టారి ఆలోచనలు పరిపరివిధాలు పోతున్నాయి. అవి పాత అభిప్రాయాలను పటాపంచలు చేసి, కొత్త అనుభవాలను, అంచనాలను ప్రతిష్టిస్తున్నాయి.

గంగన్న చెబుతున్న విషయాలూ, విశేషాలూ, అనుభవాలూ అంతరంగాలూ.... అన్నింటినీ ఒకచోట చేర్చి రాస్తే ఎన్ని పాఠ్యపుస్తకాలు అవుతాయి? ఎవరు రాయగలరు అవన్నీ? అసలు ఎవరు గుర్తిస్తారు ఇదంతా? ఏ రాళ్ళున్నాయి వాటిని తూచటానికి? ఏ పరికరాలున్నాయి కొలవటానికి? ఈ విజ్ఞానాన్ని చూసే శక్తి లేని తాము- వాళ్ళ పరిధిలో లేని విషయాలతో ముడి పెట్టి, మొద్దువెధవనో, బుద్ధావతారమనో ముద్రలు వేయటం పద్ధతేనా? న్యాయమేనా?

ఇన్నాళ్లూ ఏదో తప్పు చేసిన భావం కలిగింది మాస్టారికి.

కొండ దిగటం పూర్తయింది. ఇంకొంచెం నడిచాక, గెడ్డ వచ్చింది.

గంగన్న, నేస్తాలూ కాళ్లూ చేతులూ కడుక్కున్నారు. ముఖంపై నీళ్ళు జల్లుకున్నారు. నిన్న రాత్రి కొద్దిపాటి వర్షం కురవటంవల్ల నీళ్ళు బురదరంగులో ఉన్నాయి. తాగటానికి పనికిరావు. అందరికీ దాహం ఎక్కువగానే వేస్తోంది.

'మాస్టారూ... మీరిలా కూర్చోండి.' గెడ్డ ఒడ్డున ఓ చెట్టు కింద ఉన్న పెద్ద బండరాయిని చూపించాడు గంగన్న.

తర్వాత 'చిలకా, చిన్నయ్యా, మీరు చెలమ తీయండ్రా' అని పురమాయించి, గింజరిగాడితో కలిసి ముందుకెళ్లాడు. తుప్పల్లో వెతికి తాటిమట్ట తీసుకున్నాడు. అది రంపంలాగ ఉంది. దాంతో ఒక లేత తాటికొమ్మ కోశాడు. దాన్ని చేదలా మలిచాడు. అంతా నిమిషాల్లో అయిపోయింది.

రాయి మీద కూర్చొని, మాస్టారు రెప్ప వేయకుండా చూస్తున్నారు. చెలమ తీయటం పూర్తయింది. కాసేపట్లో చెలమనిండా నీళ్లూరాయి. అవీ బురదగానే ఉన్నాయి. ఈ నీటిని గంగన్న చేదతో చాలా ఒడుపుగా, వేగంగా బయట పారబోయటం మొదలెట్టాడు. కాసేపటికి చెలమ ఖాళీ అయింది.

మాస్టారికి గంగన్న అపురూపంగా కనిపించాడు. ప్రకృతి జ్ఞానాన్ని ఔపోసన పడుతున్నవాడిగా కనిపించాడు. కొత్తగా, ఆకాశమంత ఎత్తుగా, ఎన్నో తెలిసిన వ్యక్తిగా కనిపించాడు. మాస్టారి కళ్లలో ఆనందబాష్పాలు సుడులు తిరిగాయి.

ఆ క్షణాల్లోనే చెలమలోకి నీళ్ల చేరటం మొదలయింది. ఈసారి నీళ్ల బురదరంగులో లేవు. చాలా స్వచ్ఛంగా ఉన్నాయి. బురద రేణువులు ఇసుకపొరల్లో చిక్కుకుపోయి, నిర్మలమైన నీరు చెలమనిండా చేరింది. మాస్టారి మనసుకు అచ్చం అద్దంలా ఉంది చెలమ. చేదనిండా నీరు తీసి 'తాగండి మాస్టారూ' అన్నాడు గంగన్న.

దోసిలి పట్టారు మాస్టారు. చేదతో నీళ్ల పోస్తున్నాడు గంగన్న. మాస్టారి మామూలు దప్పిక తీరింది. జ్ఞానదాహం మొదలయింది. అది పుస్తకాల నుంచి, ఉపన్యాసాల నుంచి కాకుండా ప్రకృతి నుంచి, ప్రకృతి ఒడిలో పెరిగే పిల్లల నుంచి తెలుసుకునే జ్ఞానం.

దోసిలి బిగించి పట్టారు మాస్టారు.

నీళ్లు పోస్తూనే ఉన్నాడు గంగన్న.

ఒక్క చుక్క కూడా కింద పడిపోకుండా ఒడిసిపట్టుకొని, తాదాత్మ్యంతో తాగుతున్నారు మాస్టారు.

**(ఆంధ్రప్రదేశ్ మాసపత్రిక నవంబరు '04 సంచిక సౌజన్యంతో)**



**రచయిత మాట**

పోటీకి రాయడం, బహుమతి పొందటం ఇదే మొదటిసారి. పన్నెండేళ్ళ క్రితం(1992) 'బాలభారతి'లో వచ్చిన 'ఓ తల్లి కథ' తొలి ప్రచురిత రచన. ఆ తర్వాత పిల్లలకోసం వందకు పైగా కథలూ, కబుర్లూ రాశాను. ప్రారంభంలో బాలభారతి, బాలజ్యోతి, బాలమిత్ర, చెకుముకి, మా బడి తదితర పత్రికల్లో ప్రచురితమయ్యాయి. తర్వాత అత్యధికం 'ప్రజాశక్తి'లో వచ్చాయి. 'తెలివైన తమాషాలు'(1995) పేరిట చిక్కులెక్కలతో ఓ పుస్తకం కూడా ప్రచురితమైంది. స్వస్థలం విశాఖజిల్లా నాతవరం సమీపంలోని ఆర్లాత్తూరు. జర్నలిజం అంటే చిన్నప్పటినుంచీ చాలా ఇష్టం. ఈ రంగంలో ప్రవేశించిందీ, ప్రస్తుతం పనిచేస్తున్నదీ 'ప్రజాశక్తి' విశాఖ ఎడిషన్లోనే. సమాజాన్ని అర్థం చేసుకోవటానికి నా దృష్టినీ, దృక్పథాన్నీ విస్తృతం చేసిన గొప్పదనం 'ప్రజాశక్తి'దే. కథలపై ఆసక్తి కలిగించింది మా అమ్మ. ఈ కథలోని గంగన్నలాంటి అబ్బాయి గురించి చెప్పినప్పుడు దాన్నొక కథగా రాయమని ఉత్సాహపరిచిన నా సహచరి శాంతికీ ఈ బహుమతిలో భాగం ఉంది.

గురజాడ, శ్రీశ్రీ నుంచి ఇప్పటి కొత్త రచయితల దాకా సమాజ అభ్యుదయాన్ని కోరే ఎవరి రచనలైనా ఇష్టమే. పుస్తక పఠనం హాబీ. 'బడి అవతల' కథలోని గంగన్నలాంటి వాళ్ళు గ్రామీణ ప్రాంతాల్లో చాలా మంది కనిపిస్తారు. ఈ కథకి బహుమతి వచ్చిందంటే అలాంటి పిల్లల ఆశలకు, ఆకాంక్షలకు మద్దతు లభించినట్టే! 'ఆంధ్రప్రదేశ్' పత్రికకు ధన్యవాదాలు.

-సత్యాజీ